బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత



బీఆర్ఎస్ పార్టీ బీమా రూ.2లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, జూలై 4: మండలంలోని రెడ్యా తండాకు చెందిన మెగావత్ దేవేందర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దేవేందర్‌కు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉంది. దీంతో పార్టీ నుంచి రూ.2లక్షల బీమా చెక్కు మంజూరైంది. ఈ చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మృతుడి భార్య మెగావత్ మంజులకు గురువారం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతిఒక్కరికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రంగీల ఆంజనేయులు, నాయకులు సత్యంగౌడ్, యాదాగౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూలై 4: జిల్లా కేంద్రంలోని ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25, 2025-2026 విద్యా సంవత్సరానికి రెండో విడత ప్రవేశాలకు నేటి నుంచి ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్ ట్రేడ్లలో ప్రవేశాలకు ఆసక్తి గల వారు iti, telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళలకు అన్ని కోర్సుల్లో 33 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గౌతాపూర్ విద్యార్థులు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిలిపిచెడ్, జూలై 4: మెదక్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని గౌతాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ కృష్ణ తెలిపారు. లాంగ్ జంప్‌లో ఆర్.అజయ్ (బంగారు పతకం), 100 మీటర్లు పరుగు పందెంలోనూ ద్వితీయ బహుమతి సాధించాడు. ఆర్.జగదీశ్ లాంగ్ జంప్‌లో తృతీయ బహుమతి, హెచ్ఎం హరీశ్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, జి.హారిక 600 మీటర్లు పరుగు పందెంలో తృతీయ, ఈ.సాయికిరణ్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతులు సాధించారన్నారు. వీరిని హెచ్ఎం కృష్ణ, టీచర్లు అభినందించారు.

సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు: ఎంపీపీ

ఎంపీపీ కల్లూరి హరికృష్ణను సన్మానిస్తున్న మండల నాయకులు

శివ్వంపేట, జూలై 4: మండల అభివృద్ధిలో తనకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. గురువారం శివ్వంపేటలోని తన కార్యాలయంలో మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రెండు పర్యాయాలు ఎంపీపీగా పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనంతరం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీటీసీ నువ్వుల దశరథ, నాయకులు గడ్డమీది కృష్ణ, హర్జానాయక్, అశోక్, నరేందర్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు

నర్సాపూర్, జూలై 4: మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు గౌడ్ పుట్టిన రోజును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో క్యాంప్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

నార్సింగి జడ్పీటీసీకి ఆత్మీయ వీడ్కోలు

నార్సింగి జడ్పీటీసీని సన్మానిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, తదితరులు

చేగుంట, జూలై 4: నార్సింగి జడ్పీటీసీ బాణపురం కృష్ణారెడ్డి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద గురువారం ఏర్పాటు చేశారు. సమావేశానికి నార్సింగి ఎంపీపీ చిందం సబీతారావీందర్, వైస్ ఎంపీపీ సుజాతాశంకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరాం బాబు, చిన్నశంకరంపేట అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ వైస్ చైర్మన్ ఆకుల మల్లేశంగౌడ్ హాజరై, ఘనంగా సన్మానించారు.

వ్యక్తి అదృశ్యం

భిక్షపతి

చిన్నశంకరంపేట, జూలై 4: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబాజిపేటలో జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. అంబాజిపేట గ్రామానికి చెందిన ధ్యాప భిక్షపతి (50) నాలుగు నెలల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు, బంధువుల స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో కూడా భిక్షపతి అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లి, తిరిగి వచ్చేవాడు. ఇప్పుడు నాలుగు నెలలు గడుస్తున్నా ఇంటికి రాలేదు. కుటుంబీకకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ ప్రాయుడు దొడ్డి కొమురయ్య

దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



పెద్దశంకరంపేటలో దొడ్డికొమురయ్యకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

మెదక్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆదర్శప్రాయుడని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి నిర్వహించారు. కొమురయ్య చిత్ర పటానికి అదనపు కలెక్టర్ నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తికోసం పోరాడిన మహనీయుడు కొమురయ్య అని, దొరల దురాగతాలను ఎదిరించిన గొప్ప వీరుడని కొనియాడారు. బీసీ సంక్షేమ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, జూలై 4: దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా పెద్దశంకరంపేటలో ఆయన చిత్రపటానికి రాయిని మధు, గంగారెడ్డి, కుమార్, విఠల్‌రెడ్డి, గంగారాం నివాళులర్పించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

మెదక్‌లో విద్యాసంస్థలు బంద్ చేస్తున్న నాయకులు

నర్సాపూర్‌లో బంద్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

చిలిపిచెడ్: గౌతాపూర్‌లో ఎన్ఎస్‌యూఐ సభ్యులు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్/చిలిపిచేడ్, జూలై 4: నీట్, నెట్ పరీక్షల అవకతవకలు, పేపర్ లీకేజీని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌వర్ధన్ తెలిపారు. లీకేజీకి బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నర్సాపూర్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను బంద్ చేయించారు.

పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి



ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

శివ్వంపేట, జూలై 4: సర్పంచ్‌ల పాలన ముగియడంతో ఫిబ్రవరి నుంచి పంచాయతీలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాక తమ జీతం డబ్బులు ఖర్చు పెడుతున్నామని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో నాగేశ్వర్‌గుప్తాతో మొరపెట్టుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పంచాయతీలకు వెంటనే నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో వినతి పత్రం అందజేశారు. వారితో ఎంపీవో తిరుపతిరెడ్డి ఉన్నారు.

రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలి



మంత్రిని కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, జూలై4: నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థనుబలోపేతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. గురువారం హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా పలు గ్రామాలకు బస్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులు నర్సాపూర్ డిపోకు కేటాయించాలని కోరారు. వారితో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, అధ్యక్షుడు మల్లేశ్ ఉన్నారు.

నీట మునిగి యువకుడు మృతి

పాపన్నపేట, జూలై 4: వనదుర్గా ప్రాజెక్టులో నీట మునిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏడుపాయల ఆలయ సమీపంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లి గ్రామానికి చెందిన బర్ల రాజు(28) యూట్యూబ్ చానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం స్నేహితులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం ఆలయ సమీపంలోని ఘనపురం ఆనకట్ట వద్దకు వెళ్లి స్నేహితులు ప్రాజెక్టుపై ఉండగా రాజు స్నానం చేసేందుకు నీటిలోకి దిగాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలిలిచగా నీటిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి పల్లెకు వైద్య సిబ్బందితో సర్వేలు

వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి

రామాయంపేట, జూలై 4: ప్రతి పల్లెలో ఆరోగ్య సర్వేలు చేపడుతున్నట్లు జిల్లా వైద్యాధికారి శ్రీరాం పేర్కొన్నారు. గురువారం మండలంలోని డీ.ధర్మారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. దవాఖానలోని రికార్డులు, ఆపరేషన్ థియేటర్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ దవాఖానలోనే డెలివరీ కావాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సర్వేలు చేపడుతున్నామన్నారు. ఆరోగ్య సర్వేలతో పాటు ప్రతి గ్రామంలో, పల్లెల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌వో వెంట పీహెచ్‌సీ వైద్యురాలు హరిప్రియ, సిబ్బంది ఉన్నారు.

దళితుల శ్మశాన వాటికకు హక్కు పత్రం ఇవ్వాలి

నర్సాపూర్, జూలై 4: మండలంలోని కాగజ్ మద్దూర్ గ్రామానికి చెందిన దళితుల శ్మశాన వాటికకు హక్కు పత్రం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ కమలాద్రికి వినతి పత్రం అందజేశారు. మల్లేశం మాట్లాడుతూ కాగజ్‌మద్దూర్ గ్రామంలో దళితుల తాత ముత్తాతల నుంచి సర్వే నెంబర్ 60/అ1 లో గల 0.23 గుంటల్లో బొందలు పెడుతున్నారని, దానికి ఎలాంటి హక్కు పత్రం లేకపోవడంతో కొంత మంది రియల్టర్లు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దళితులకే చెందినట్టుగా పంచాయతీ తీర్మానించిన పత్రం ఇచ్చినప్పటికీ కబ్జా చేసుకోవాలని చూస్తున్నారన్నారు. ధర్నాలో సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు, దళితులు కుమార్, యాదయ్య, లచ్చయ్య, దేవరాజు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆనంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

మా జీతాలు ఇచ్చేవరకు పని చెయ్యం

చిలిపిచెడ్, జూలై 4: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులకు 8, 9 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఇచ్చే వరకు పనులు చెయ్యమని పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ప్రభుత్వం తమ జీతాలు, ఇన్సూరెన్స్ కార్డులు, ఐడీ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్మికులు బాలయ్య, ప్రభాకర్, మాణయ్య, యాదగిరి, వెంకయ్య, సంజీవులు, పాడ్యనాయక్, నారాయణ పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్

వెల్దుర్తి, జూలై 4: షరతులు లేకుండా రైతు భరోసా ఇవ్వాలని గురువారం వెల్దుర్తి సహకార సంఘంలో చైర్మన్ అనంతరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రైతులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని అమలు చేసిందని, ఎలాంటి షరతులు పెట్టలేదన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఈనెల 15 లోపు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్ల వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారులు, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

తూప్రాన్, జూలై 4: జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతుల అభిప్రాయ సేకరణ, అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తూప్రాన్ సహకార సంఘంలో చైర్మన్ బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో డీఏవో గోవింద్, వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, సీఈవో దినేశ్, డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపి, సరిత బాబుల్‌రెడ్డి, యాదాగౌడ్, ముత్యాలు, వెంకటమ్మ, వెం కట్ రెడ్డి, జావిద్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఏవో గంగమల్లు, ఏఈవోలు సంతోష్, సింధు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి గోవింద్

మనస్తాపంతో ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

యాదగిరి (ఫైల్)

కొల్చారం, జూలై 4: భార్యాభర్తల గొడవ కారణంగా భర్త చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనగండ్ల గ్రామ శివారులో గురువారం జరిగింది. ఎస్సై గౌస్ కథనం ప్రకారం.. మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెం దిన బోయిని యాదగిరి(28)కి ఏడాదిన్నర క్రితం టేక్మాల్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మానసతో వివాహం జరిగింది. మృతుడు ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుం బ సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన యాదగిరి బుధవారం రాత్రి ఇట్లోంచి వెళ్లిపోయాడు. తెల్లవారుజాము వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కలా గాలించారు. పల్లెగడ్డ తండా సమీపంలో ఎనగండ్ల శివారులో ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.

విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి

చేగుంట, జూలై 4: విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో గురువారం జరిగింది. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తలారి నారాయణ పాడి గేదె కస్తూర్బా పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తున్నది. ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కిందికి ఉండడంతో మేత మేస్తూ విద్యుత్ షాక్‌కు గురై అక్కడక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు నారాయణ కోరారు.

మండలాల ప్రత్యేక అధికారులు

రామాయంపేట, జూలై 4: మండల అభివృద్ధికి తన శక్తిమేర కృషి చేస్తానని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం రామాయంపేట ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

నిజాంపేటకు గోవింద్

నిజాంపేట, జూలై4: మండల ప్రత్యేకాధికారిగా గోవింద్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో రాజిరెడ్డి ప్రత్యేకాధికారికి సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వినయ్, కార్యదర్శి నర్సింహులు, సిబ్బంది ఉన్నారు.

చిన్నశంకరంపేటకు విజయశేఖర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జూలై 4: చిన్నశంకరంపేట మండల ప్రత్యేక అధికారిగా విజయశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సిబ్బంది సన్మానించారు.

పెద్దశంకరంపేటకు హరికృష్ణ

పెద్దశంకరంపేట, జూలై 4: పెద్దశంకరంపేట మండల ప్రత్యేకాధికారిగా సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ గురువారం నియామకమయ్యారు. సిబ్బంది సన్మానించారు.

చిలిపిచెడ్‌కు మన్యనాయక్

చిలిపిచెడ్, జూలై 4: మండల ప్రత్యేక అధికారిగా బి.మన్యనాయక్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్ సమక్షంలో గురువారం బాధ్యతలు సేకరించారు.

ఉచిత వైద్యశిబిరం

రామాయంపేట, జూలై 4: మండలంలోని సుతారిపలిలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వందమంది చికిత్సలు చేయించుకున్నారు. శిబిరంలో ఏఎన్ఎం సుధ, ఆశవర్కర్లు మంజుల, స్రవంతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు

రామాయంపేట, జూలై 4: రామాయంపేటలోని వెంకటేశ్వర కాలనీలో లయన్స్ క్లబ్ స్నేహబంధు ఆధ్వర్యంలో వేప, జామ, గన్నేరు, నందివర్ధనం తదితర రకాల మొక్కలను దామోదర్‌రావు, ఐరేని రవీందర్‌గౌడ్, సాగర్ నాటారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాపన్నపేట, జూలై 4: మండలంలోని కుర్తివాడ గ్రామంలో తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి రెండు లక్షల నగదుతో పాటు బంగారం ఆభరణాలు చోరీ చేసిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పారం గంగయ్య ఈ నెల రెండో తేదీన ఊరికి వెళ్లి బుధవారం ఇంటికొచ్చాడు. ఇంటి తాళం పగలగొట్టబడి ఉంది. ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న రెండు లక్షల రూపాయల నగదు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేశ్ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, జూలై4: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లిలో జరిగింది. ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. ధర్పల్లి గ్రామానికి చెందిన నర్సింహులు (41) హైదరాబాద్‌లోని అల్వాల్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సొంత గ్రామంలో ఇల్లు లేకపోవడంతో నాలుగేండ్ల క్రితం అప్పు చేసి ఇంటిని నిర్మించాడు. కొంతకాలంగా ఇంటి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందేవాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి గ్రామానికి వెళ్లి వస్తానని భార్య నాగమణితో చెప్పి వెళ్లాడు. గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నానని తన బావమరిది శ్రీనుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అతడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని చెట్టుకు ఉరేసుకుని ఉన్న నర్సింహులును కిందకు దించి మెదక్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గురువారం ఉదయం పరిస్థితి విషమించి నర్సింహులు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం 16K to 18K ఏజెంట్ కమీషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.